అసంపూర్తిగా పనులు.. ఆకతాయిల ఆగడాలు

- 64వ డివిజన్ పార్కును గాలికొదిలేసిన కూటమి సర్కార్
- పనుల్లో జాప్యం.. పడకేసిన ఆహ్లాదం

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు అధ్వానంగా మారుతున్నాయి. దీంతో వాకర్స్, వృద్ధులు, చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణం కనుచూపు మేర కనిపించడం లేదు. 64వ డివిజన్ లగడపాటి కల్యాణ మండపం సమీపంలోని పార్కులో వాకింగ్ చేసే వారికి వీలుగా గ్రీనరీ మేట్, మొక్కలు పెంచడం, చిన్నారులు ఆడుకునే ఆట పరికరాలు ఏర్పాటు కోసం విజయవాడ నగరపాలక సంస్థ రూ.8 లక్షలను మంజూరు చేసింది. నిధుల కేటాయింపులు జరిగి 8 నెలలు కావస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగడంలేదు. పార్కులో కేవలం వాకింగ్‌కు అవసరమైన సిమెంట్ దిమ్మలతో లైనింగ్ వర్కు చేసి ఆపేశారు. మిగిలిన పనులు ఎప్పుడా అంటూ పట్టణ ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

అధికారుల అలసత్వం..

పార్కులో మొక్కలు పెంచడానికి అవసరమైన ఎర్ర మట్టిని నింపకపోవడంతో మొండిగోడల వాతావరణం కనిపిస్తోంది. ఎర్రమట్టిని అవసరమైన ప్రాంతంలో నింపి ఉద్యానశాఖకు అప్పగిస్తే మొక్కలు పెంచడానికి వీలుగా ఉండదని ఉద్యానశాఖ సిబ్బంది అంటున్నారు. ఈ రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో పార్కులో ఆహ్లాదకర వాతావరణం కనిపించడంలేదు. బదులుగా ఆకతాయిల ఆగడాలకు పార్కు అడ్డాగా మారింది. పార్కులో మొక్కల పెంపకానికి అవసరమైన బోరు చెడిపోయినా పట్టించుకునే వారే కరువయ్యారు. చిన్న పిల్లలకు జారుడుబల్ల, ఊయల లాంటి ఆటల పరికరాలు కనీసం ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదు.



64వ డివిజన్ పార్కులో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు

రెచ్చిపోతున్న ఆకతాయిలు..

పార్కులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సాయంత్రం అయ్యే సరికి చుట్టు పక్కల యువత మద్యం సీసాలతో దర్శనమిస్తున్నారు. మద్యం సేవించడం, పేకాట రాయుళ్లు జూదం ఆడుకోవడం, గంజాయి సేవించి గొడవలు పడడం వంటి పనులు ఇక్కడ నిత్యకృత్యం అయిపోయిందని స్థానికులు చెబుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండడంతో పార్కులో వాకింగ్ చేసేందుకు వెళ్లాలంటే భయంగా ఉందని వాపోతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై గొడవలకు దిగడంతో ఎవ్వరూ అటు వైపు వెళ్లడం లేదు. పార్కులో జరిగే అసాంఘిక కార్యకలాపాల గురించి పోలీసులకు సమాచారం ఇచ్చినా ఎలాంటి ప్రయోజనం లేదంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటు చేసిన పార్కులు కాస్త ఇప్పుడు భయాందోళన పంచే ప్రాంతాలుగా మారిపోయాయి. పార్కుల నిర్వహణను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పార్కును అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పార్కులో మద్యం సీసాలు



పాడైపోయిన మోటరు

గేటుపెట్టి వదిలేశారు..

64వ డివిజన్ లగడపాటి కల్యాణ మండపం సమీపంలోని పార్కుకు కేవలం గేటు మాత్రమే పెట్టి వదిలివేశారు. మిగిలిన సదుపాయాలు ఏమీ కల్పించలేదు. నామమాత్రంగానే పార్కు ఉంది. పార్కు అని చెప్పడమే తప్ప ఇక్కడ అలాంటి వాతావరణం కనిపించడం లేదు.



– వెంకటేశ్వరరావు, కండ్రిక

క్లుప్తంగా

క్రికెట్ టోర్నీలో కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగుల రాణింపు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కమర్షియల్ ట్యాక్స్ వెంకటగిరి సర్కిల్ ఆధ్వర్యంలో ఆ శాఖ ఉద్యోగులకు జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజయవాడ డివిజన్‌కు చెందిన ఉద్యోగుల టీమ్ రన్నర్స్‌గా నిలిచి కప్‌ను గెలుచుకున్నారు. కమర్షియల్ ట్యాక్స్ చిత్తూరు డివిజన్ సౌజన్యంతో వెంకటగిరిలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు టోర్నమెంట్‌ను నిర్వహించారు. అందులో భాగంగా విజయవాడ డివిజన్‌కు చెందిన టీమ్ జి.కిరణ్‌కుమార్ కెప్టెన్‌గా ద్వితీయ స్థానంలో నిలిచి రన్నర్ కప్‌ను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ 1, 2 జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్‌కుమార్‌ను విజయం సాధించిన ఉద్యోగుల బృందం కలిసి కప్‌ను అందించారు. ప్రశాంత్‌కుమార్ ఉద్యోగులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందు మరిన్ని విజయాలను అందుకోవాలని సూచించారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్ సింగ్ నగర్, లెనిన్ సెంటర్‌లో బుధవారం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ (ఆరోగ్య శ్రీ) పథకం ఆధ్వర్యంలో స్వర హాస్పిటల్, సంధ్య కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలకు శంకుస్థాపన..

పాయకాపురం(విజయవాడరూరల్): 64వ డివిజన్ కండ్రికలో శివాలయం పక్కన ప్రభుత్వ స్థలంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించే గోశాలకు ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా కొంత భాగాన్ని గోశాలకు, మరికొంత స్థలాన్ని ఫెన్సింగ్ నిర్మించి సంరక్షిస్తామని అన్నారు. కాకొల్లు రవికుమార్, కంకణాల బాబు, పలగాని భాగ్యలక్ష్మి, కోరాడ రమణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం కుటుంబరావు వీధిలో సీతారాముల కల్యాణ మహోత్సవ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణ విందును నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్‌రావు, కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి ముఖ్య అతిథులుగా పాల్గొని అన్న ప్రసాదాన్ని వడ్డించారు. ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. 5 వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు చెరుకూరి కృష్ణకుమార్, కంచర్ల రాము, ఎస్‌వీఆర్, వల్లభనేని సతీష్ తదితరులు పర్యవేక్షించారు.

వేడుకగా గణపతి హోమం



విజయవాడ కల్చరల్: లబ్బీపేట శ్రీవేంకటేశ్వర స్వామి, శారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో సంకట హర చతుర్థి సందర్భంగా లోక కల్యాణార్థం శారదా చంద్రమౌళీశ్వర్లుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి ఆదేశంతో పూజా క్రతువులు ఘనంగా నిర్వహించారు. దేవాలయ కార్యక్రమ పర్యవేక్షకుడు డాక్టర్ సి.రామ్మోహనరావు మాట్లాడుతూ.. ఆదిదైవం, సర్వవిఘ్న హరుడు, సర్వసిద్ధి ప్రదాత అయిన గణపతిని సేవించడం శ్రేయోదాయకమన్నారు. పండితులు వేడుకగా గణపతి హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటి పట్టాల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అజిత్‌సింగ్ నగర్ టీడీపీ కార్యాలయంలో బుధవారం 62వ డివిజన్‌కు చెందిన పలు కుటుంబాలకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు పంపిణీ చేశారు. అనంతరం తుపాకుల రంగారావుకు రూ.61,572 సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఘంటా కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ కాలువల ఆధునికీకరణకు వినతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్ఎస్‌పీ) కాలువల ఆధునికీకరణకు గ్రాంట్ మంజూరు చేయాలని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అర్వింద్ పనగారియాకు ఎన్ఎస్‌పీ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ వినతిపత్రం సమర్పించారు. బుధవారం విజయవాడకు వచ్చిన ఆర్థిక సంఘం చైర్మన్‌ను కలిసి గోపాలకృష్ణ వినతి పత్రం అందజేశారు. కాలువల నీటి నిర్వహణ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయిందని వినతి పత్రంలో పేర్కొన్నారు.

కూరగాయల దుకాణంలో చోరీ

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీలో కూరగాయల దుకాణం తాళాలు పగులగొట్టి చోరీ చేసినట్లు ఫిర్యాదు రాగా నున్న పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. పి.నైనవరం గ్రామానికి చెందిన చిన్నంశెట్టి శ్రీను వాంబే కాలనీలో కూరగాయల వ్యాపారం చేస్తుంటారు. ఈ నెల 15న రాత్రి 10 గంటలకు షాపునకు తాళాలు వేసి ఇంటికి వెళ్లి మర్నాడు ఉదయం షాపు వద్దకు రాగా దుకాణం తాళాలు పగలగొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా కౌంటర్లో ఉండాల్సిన రూ.1.60 లక్షలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఫిర్యాది పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కందుకూరి సేవలు చిరస్మరణీయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి కందుకూరి వీరేశలింగం పంతులు అని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కొనియాడారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో బుధవారం కందుకూరి విరేశలింగం పంతులు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లాది మాట్లాడుతూ.. సాహితీవేత్తగా, సంఘ సంస్కర్తగా కందుకూరి వీరేశలింగం పంతులు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సాంఘిక దురాచారాలను నిర్మూలించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. బాల్యవివాహాలను నిర్మూలించడంలో కందుకూరి చేసిన కృషి అనిర్వచనీయం అన్నారు. అలాగే తెలుగు నాటకరంగానికి వీరేశలింగం అందించిన సేవలు గణనీయమైనవని విష్ణు పేర్కొన్నారు. కందుకూరి సేవలకు గుర్తుగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఏప్రిల్ 16వ తేదీని తెలుగు నాటకరంగ దినోత్సవంగా ప్రకటిస్తూ.. 2007 మార్చిలో జీఓ విడుదల చేసినట్లు గుర్తుచేశారు. అదే ఏడాది తొలిసారిగా తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు

చిరువ్యాపారులపై అధికార పార్టీ వేధింపులు ఆపాలి

సీఐటీయూ నాయకులు దోనేపూడి కాశీనాథ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీసెంట్ రోడ్డులో యాభై ఏళ్లకు పైగా చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారిపై అధికార పార్టీ వేధింపులు ఆపాలని ఎన్టీఆర్ జిల్లా సీఐటీయూ నాయకులు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. బుధవారం బీసెంట్ రోడ్డులోని అన్సారీ పార్క్ ఎదురుగా చిరువ్యాపారులు ధర్నా నిర్వహించారు. మద్దతుగా పాల్గొన్న కాశీనాథ్ మాట్లాడుతూ.. చిరువ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అధికార పార్టీ నేతలు చిరువ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయాలని చూస్తున్నారని అన్నారు. వ్యాపారస్తుల మధ్య గొడవలు సృష్టించి లబ్ధి పొందేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. సెంట్రల్ సిటీ సీఐటీయూ అధ్యక్షులు కె.దుర్గారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు చిరు వ్యాపారస్తులకు రక్షణ కల్పిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తర్వాత జీవనోపాధిని దెబ్బతీయడం సమంజసం కాదన్నారు. సీఐటీయూ సెంట్రల్ సిటీ కోశాధికారి వై.సుబ్బారావు, నగర నాయకులు బాలబొమ్మల క్షణ, విజయవాడ హాకర్స్, తోపుడు బండ్ల యూనియన్ సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు బెవర వెంకటేశ్వరరావు, సీహెచ్ మురళి, బెవర శ్రీను, ఎస్కే మస్తాన్, వై.ప్రవంతి, సూరమ్మ, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బీసెంట్ రోడ్డు అన్సారీ పార్క్ ఎదురుగా ధర్నా చేస్తున్న చిరువ్యాపారులు

'శీతల పానీయాలు వద్దు... పండ్ల రసాలు ముద్దు'

అఖిల భారత యువజన సమాఖ్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్యానికి హానికరమైన శీతల పానీయాలను నివారించాలని, పండ్ల రసాలు, కొబ్బరి బోండాలు, వ్యవసాయ ఉత్పత్తులను ప్రచారం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర డిమాండ్ చేశారు. 'శీతల పానీయాలు వద్దు, పండ్ల రసాలు ముద్దు' అంటూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఏఐవైఎఫ్ కార్యకర్తలు కూల్ డ్రింక్స్ పారబోసి, కొబ్బరి, బత్తాయి, పుచ్చకాయ, ఇతర పండ్లతో ప్రదర్శన నిర్వహించారు. పరుచూరి రాజేంద్ర మాట్లాడుతూ.. వేసవిలో శీతల పానీయాలు తాగడంతో అనేక అనర్థాలు ఉన్నాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం, సినీ ప్రముఖులు వారి ఆదాయం కోసం శీతల పానీయాలపై ప్రచారం చేయెద్దని.. పండ్లు, కొబ్బరి బోండాలు, వ్యవసాయ ఉత్పత్తులను ప్రచారం చేయాలని హితవు పలికారు. ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు కంచర్ల భార్గవ్, కార్యదర్శి లంకా గోవిందరాజులు, సీపీఐ నాయకులు తాడి పైడయ్య, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.సాయి కుమార్, షాదిక్, ఏఐవైఎఫ్ నాయకులు సింగంశెట్టి మోహన్ ప్రసాద్, ఐ.ఆంజనేయులు, శ్రీరం రవికుమార్, కంది ఆదినారాయణ, జి.రవి, గంట మమత, నరేష్, షైనీ, స్వప్న, సరోజిని, నాగ పార్వతి, దమ్ము రమేష్ పాల్గొన్నారు.



పండ్లు, పండ్ల రసాలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ ప్రదర్శన

21 నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ప్రారంభం

కృష్ణలంక(విజయవాడతూర్పు): పదో తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో ఈ నెల 21 నుంచి కంప్యూటర్ కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ విభాగం ఇన్‌చార్జి టి.క్రాంతికిరణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎం.ఎస్.ఆఫీస్, డీటీపీ, ఫొటోషాప్ కోరల్‌డ్రా, ట్యాలీ, సీ లాంగ్వేజ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. గత 9 సంవత్సరాలుగా అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో జాబ్ ఓరియంటెడ్‌గా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఆసక్తి కలవారు గవర్నర్‌పేటలో రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో గానీ, 90145 41958, 94900 98042 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

29 మంది మందుబాబులకు జరిమానా

విజయవాడలీగల్: మద్యం సేవించి వాహనాలు నడిపిన 29 మందికి 8వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు జరిమానా విధించారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో 5వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిలో 11మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, 18 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రతిరోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి.. పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేయడం జరుగుతుందని, వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు సూచించారు.

వివాహిత కనిపించడం లేదంటూ ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చర్చికి వెళ్లడానికి డబ్బులు ఇవ్వలేదని తన భార్య అలిగి ఇంట్లోంచి వెళ్లిపోయారంటూ బుధవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసుల వివరాల ప్రకారం.. రామకృష్ణాపురంకు చెందిన దారావత్ వెంకటేశ్వరరావు రైల్వేలో ఉద్యోగం చేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని భార్య ఆదిలక్ష్మితో కలిసి ఇంట్లోనే ఉంటున్నారు. సోమవారం ఉదయం వెంకటేశ్వరరావు భార్య ఆదిలక్ష్మిని టిఫిన్ పెట్టమని అడిగారు. తనకు చర్చికి వెళ్లే టైం అయ్యిందని టిఫిన్ పెట్టుకుని తినమని భార్య చెప్పగా.. ఇరువురికీ వాగ్వాదం జరిగింది. అనంతరం చర్చికి వెళ్లేందుకు డబ్బులు ఇవ్వాల్సిందిగా ఆదిలక్ష్మి భర్తను కోరారు. దీంతో తాను డబ్బులు ఇవ్వనని చెప్పారు. అలిగిన ఆదిలక్ష్మి ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాకపోవటంతో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థలోని వివిధ శాఖాధిపతులంతా నగరాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర చెప్పారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో అన్ని శాఖాధిపతులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధికై జరుగుతున్న పనులను సమీక్షించారు. నగరంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. మంజూరైన ఇంజినీరింగ్ పనులను సిబ్బంది త్వరగా పూర్తి చేయాలన్నారు. పనుల కార్యాచరణలోనూ అభివృద్ధి కనపడాలని అధికారులను ఆదేశించారు. ఎస్టేట్ విభాగం పరిధిలోకి వచ్చే అన్ని ఆస్తులు ఫైర్ ప్రూఫ్‌గా ఉండాలని, దానికి ఫైర్ ఆఫీసర్ ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి..

అనధికార హోర్డింగ్‌లను, కట్టడాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని చీఫ్ సిటీ ప్లానర్‌ను కమిషనర్ ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించి, నగరాన్ని అభివద్ధి పథంలో నడపాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్య కుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ యూసీడీ పి.వెంకటనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, అకౌంట్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

గ్రంథాలయ పునర్వికాస సభను విజయవంతం చేయాలి

విజయవాడ కల్చరల్: జాతి ఉన్నతిని, ఔన్నత్యాన్ని చాటే గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకురావాలని.. ఈ ఉద్యమంలో కవులు, రచయితలు, పబ్లిషర్స్ భాగస్వాములు కావాలని గ్రంథాలయ పునర్వికాస వేదిక కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ పిలుపు నిచ్చారు. వేదిక ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ.. స్థానిక గ్రంథాలయ వ్యవస్థ నిర్వీర్యమైపోయిందన్నారు. వ్యవస్థకు పూర్వవైభవం తీసుకురావడానికి రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో చైతన్యం తీసుకురావడానికి వేదిక ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఆదివారం బందరు రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో విద్యాసంస్థలు, గ్రంథాలయాలు, సాంకేతిక రంగంలో పుస్తక పఠనం, పౌరగ్రంథాలయాలు, సమస్యల పరిష్కార మార్గాలు అంశంగా పలువురు తమ అభిప్రాయాలను తెలియజేస్తారని వివరించారు. వేదిక కీలక బాధ్యుడు బెల్లపు బాబ్జి మాట్లాడుతూ ఈ సమావేశంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల కవులు, రచయితలు, పుస్తక విక్రేయతలు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు పాల్గొంటారని తెలిపారు. మనోహర నాయుడు, లక్ష్మయ్య, లక్ష్మి, వెంకటనారాయణ, చలపాక ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యమ పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శివప్రసాద్ తదితరులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట సబ్ స్టేషన్ పరిధి 11కేవీ ఏఎస్ రోడ్డు, అరండల్ పేట ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మత్తులు, నిర్వహణ పనుల నిమిత్తం గురువారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు తెలిపారు. కోదండ రామిరెడ్డి వీధి, వెంకటేశ్వరరావు వీధి, జలీల్ వీధి, మొహిద్దీన్ వీధి, దుర్గయ్య వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

19న 'రన్ ఫర్ జీసస్' శాంతి ర్యాలీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చస్, అన్ని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 19న 'రన్ ఫర్ జీసస్'(ఏసు కోసం పరుగు) శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీఎస్ఐ కృష్ణా గోదావరి డయాసిస్ బిషప్ మోస్ట్ రెవరెండ్ తంటేపూడి జార్జి కొర్నేలియస్ తెలిపారు. బిషప్ అజరయ్య స్కూల్ ప్రాంగణంలోని ఆల్ సెయింట్ చర్చి వద్ద బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో శాంతిర్యాలీ టీ షర్ట్‌ను ఇతర క్రైస్తవ ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిషప్ జార్జి కొర్నేలియస్ మాట్లాడుతూ.. శాంతి ర్యాలీని విజయవాడతో పాటు ఏపీ, తెలంగాణాలోని 600 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో క్రీస్తు విశ్వాసులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెవరెండ్ అల్లూరి విశ్వప్రసాద్, పాస్టర్ ప్రవీణ్ శీలం, బెల్లంకొండ శివాజీరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిషప్ జార్జి కొర్నేలియస్, ఇతర ప్రతినిధులు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 1200 ఓటర్లకు పైబడిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను కొత్త పోలింగ్ కేంద్రాలకు షిఫ్ట్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని సెంట్రల్ నియోజకవర్గ ఎలక్ట్రాల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన ఛాంబర్లో సెంట్రల్ నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 50 కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని.. ఆ సమావేశంలో 18 ఏళ్లు నిండిన నూతన ఓటర్ల ఎన్రోల్మెంట్‌ల గురించి చర్చించారు. ఏఈఆర్‌వోలు విజయవాడ నగర పాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాంబాబు, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ ప్రాజెక్ట్ పి.సత్యకుమారి, సెంట్రల్ తాహసీల్దార్ వెంకట రామయ్య, ఉత్తర తహసీల్దార్ సూర్యారావు, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్.వీరభద్రరావు(సీపీఐ), ఎం.వినోద్‌కుమార్(బీఎస్పీ), ఎన్.వెంకట్(బీజేపీ) ఎన్.సాంబశివరావు(టీడీపీ) జి.సుందర్పాల్ (వైఎస్ఆర్‌సీపీ), బి.వంశీకృష్ణ(జేఎస్‌పీ) పాల్గొన్నారు.